
ఆంధ్రజ్యోతి, తెలుగు కళా సమితి (న్యూజెర్సీ) రాజాలక్ష్మీ ఫౌండేషన్ మద్రాస్ వారి కథల పోటీలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ.



# శిక్ష

– పంతుల విజయలక్ష్మి

"మీకసలు బుద్ధి లేదు" పెళ్ళయ్యాక, ఈ పాతికేళ్ళలోను జగదాంబ, భర్తగురించి తనకున్న ఈ అభిప్రాయాన్ని ఎన్ని వేలసార్లు స్పష్టంచేసిందో!

భీమశంకరం ఎప్పటిలాగే మారుమాట్లాడలేదు. భార్య టిఫెన్ ప్లేటు తెచ్చి, టీపాయ్‌మీద చప్పుడు చేస్తూ పెట్టింది. రాత్రినుంచి ఆ ఇంట్లో ఒక విచిత్రమైన విషయం గురించి చర్చ జరుగుతోంది. సునందవల్లి ఏదో పుస్తకం చేత్తో పట్టుకుని కూర్చుని వుంది. కళ్లు పుస్తకంలోని పేజీలమీదే వున్నా, ఆమె తల్లిదండ్రుల ఆందోళన గమనిస్తూనే వుంది.

తల్లి దొరికిన అవకాశాన్ని వదులుకోకుండా తండ్రిని దులపరించేస్తూనే వుంది. తండ్రి పది మాటలకో మాటగా వుండుండి జవాబు లిస్తున్నాడు.

"తలెత్తుకుని రేపు ఆఫీసు కెలా వెళ్ళడం?..." భీమశంకరానికి ఏమీ పాలుపోవడం లేదు.

"ఏమొచ్చిందిటా? ఆఫీసుకు తలెత్తుకుని వెళ్ళలేకపోవడానికి మీవల్ల ఏం ఘోరం ఇప్పుడు జరిగిపోయిందనీ.. అవి డేదో అవాకులు చెవాకులు వాగివుంటే, ఆ నిందా రొష్టూ ఆవిడవి... మీకేం మధ్యన..." జగదాంబ భర్త ముందు నుంచి టిఫెన్ ప్లేటు తీసెయ్యబోతూ ఆగిపోయింది. పెట్టిన ఇడ్లీలు అలావే వున్నాయి. ఒకటో అరో ముక్క కొరికి వదిలేశాడు. టిఫెన్ మింగుడుపడినట్టు లేదు.

"ఇలా వదిలేశారేం?" భర్తని నిలదీసింది జగదాంబ.

"సయించలేదే"

"అయ్యో, రామ! ఇది మరీ బాగుంది. ఉరితాడు సరదాగా పీకకి తగిలించుకోవడం... ఆ తర్వాత ఊపిరాడక విలవిలలాడిపోవడం.. ఇలా వుంది మీ వరస... చాదస్తాలు ఓడకండి. ఇప్పుడేం జరిగిపోలేదు. ఆ రెండిడ్లీలు తినండి" అంది జగదాంబ కోపంగా.

కష్టంమీద ఏదో తిన్నాననిపించాడు భీమశంకరం. ప్లేట్లో చెయ్యి కడుక్కుని సునందవల్లి వేపు చూస్తూ అడిగేడు "అయితే నువ్వసలు స్టూడియోలోకే వెళ్ళలేదంటావు. అక్కడేం జరిగిందో తెలీదంటావు. అవునా?"

అంతేమరి అన్నట్టుగా తలూపింది సునందవల్లి. "లోపలికి వెళ్ళక, మరెక్కడికి అఘోరించేవే? నిన్నసలు ఆవిడ వెంట పంపించింది దేనికని..." కోపంగా అరుస్తూ అంది జగదాంబ.

సునందవల్లి మాట్లాడలేద. ఆమె తీరు జగదాంబకీ భీమశంకరానికీ కోపం తెప్పిస్తోంది.

"అసలా రోజు ఏం జరిగిందే?" జగదాంబ బతిమాలే ధోరణిలో అడిగింది.

సునందవల్లి మాట్లాడకపోవడంతో "ఏం జరిగిదంటే మాట్లాడవేం?" పరుషంగా అడిగేడు భీమశంకరం.

తల్లీ తండ్రీ తననలా నిలదీయడం మరి సహించలేకపోయింది సునందవల్లి.

"ఆరోజేం జరిగిందా? భూమి బద్దలైంది... ఆకాశం కూలి నెత్తిమీద పడింది. సరేనా!" అంటూ విసవిసా తన గదిలోకి వెళ్ళిపోయింది.

కూతురు ఇలా ఆకుకీ పోకకీ అందకుండా తిక్కగా జవాబిచ్చేసరికి ఆ దంపతులు చేష్టలు దక్కి వుండిపోయేరు. కాసేపు ఇద్దరిలో ఎవరూ మాట్లాడలేదు.

మరి కాస్సేపటికి భీమశంకరం గొంతు పెగుల్చుకుని అన్నాడు. "అమ్మ పట్ల నీ ధోరణి కాస్త సజావుగా వుంటే, ఇవాళ మనకీ టెన్షన్ వుండేది కాదు కదా..."

అంతే!

అలా అనేసేడే కాని, అసలు తను అలా అనగలగడం తనకే ఆశ్చర్యంగా వుంది భీమశంకరానికి.

ఆ మాటలతో ఆ ఇంట్లో ఓ పెద్ద తుఫాను మొదలయింది. జగదాంబ ఇల్లూ వాకిలీ ఎగిరిపోయేలా కేకలెయ్యడం ప్రారంభించింది. అత్తగారిని, భీమశంకరాన్ని ముందు ఏడుతరాల వారినీ తిడుతూ ఏడ[illegible]లూ పెడబొమ్మలు పెట్టసాగింది.

మధ్య మధ్యలో భీమశంకరం కూడా కలుగజేసుకుని ఓ మాట [illegible]రుతూ వుండడంతో ఆ గొడవ మరింత పెద్దదయింది.

సునందవల్లి తన గదిలోనుంచి వాళ్ల కేకలు, వాదనలూ వింటూ నవ్వుకుంది.

* * *

ఈ గొడవంతటికీ మూల కారణం ఆ ఇంట్లో దాదాపు నాలుగు నెలల కిందట జరిగిన ఓ సంఘటన.

ఆరోజు భీమశంకరం ఆఫీసు కొలీగ్ రామ్మూర్తి వచ్చి ఓ విషయం చెప్పేడు.

ఆంధ్రదేశంలో ప్రఖ్యాతిపొందిన ఓ టీవీ ఛానల్‌వాళ్ళు వారం వారం నిర్వహించే 'మీతో మేము' కార్యక్రమంలో ఈసారి కేవలం వృద్ధులతో ఓ కార్యక్రమం నిర్వహించబోతున్నారట.

వృద్ధుల మనోభావాలు, వారి సమస్యలు అందులో చర్చకు వస్తాయట. ఆ టీవీ ఛానల్‌వారు ప్రసారం చేస్తున్న ఈ కార్యక్రమానికి మంచి జనాదరణ వుంది. సంఘంలో వుండే రకరకాల వ్యక్తుల అభిప్రాయాలు నిష్కర్షగా అందులో వెల్లడి అవుతూ వుంటాయి.



కేవలం వృద్ధులతో తీసే ఆ కార్యక్రమం రెండు ఎపిసోడ్స్‌లో వుంటుందని, భీమశంకరం [illegible] అన్నపూర్ణమ్మగారు అందులో పాల్గొనేలా చేయించగలననీ చెప్పాడు రామ్మూర్తి.

భీమశంకరం మరో ఆలోచన లేకుండా అందుకు అంగీకరించేడు. ఆ ఏర్పాట్లేవో చూడమన్నాడు. తల్లితో ఆ విషయం చెప్తే, 'నాకెందుకు నాయనా అలాంటివన్నీ' అందే తప్ప గట్టిగా వారించలేదు. కొడుకూ కోడలు చెప్పేదాన్ని కాదనగలిగే స్వాతంత్ర్యం ఆవిడా ఇంట్లో ఎప్పుడో పోగొట్టుకుంది.

ఆ తర్వాత రామ్మూర్తి చకచకా పనిచేశాడు. అన్నపూర్ణమ్మగారు కూడా తక్కిన వృద్ధులతోపాటు ఆ కార్యక్రమంలో పాల్గొనే అవకాశం వచ్చింది.

జగదాంబకిదంతా నచ్చలేదు. ఎంతో ప్రాచుర్యం వున్న టీవీ ఛానెల్లో– బుల్లి తెరమీద అత్తగారు కనిపించడం– అంతేకాక కాస్సేపే()దో మాట్లాడే అవకాశం లభించడం ఆమె సహించలేకపోతోంది. ముందూ వెనకా ఆలోచించకుండా భర్త ఇందుకు అంగీకరించినందుకు భర్తమీద విరుచుకుపడింది.

"ముసిలాడికి దసరా పండుగని, చాలా బాగుంది సంబరం... మరింకేం, ఏ బ్యూటీ పార్లర్‌కో తీసికెళ్ళి మీ అమ్మగారికి షోకులు మేకప్పూ చేయించి మరీ స్టూడియోకి తీసుకెళ్ళండి... అఖిలాంధ్ర ప్రేక్షకులూ ఆవిడ అందచందాలని చూసి తరిస్తారు..." అంది వెటకారంగానూ, ఉక్రోషంగానూ.

భీమశంకరానికి గొంతులో పచ్చి వెలక్కాయ పడ్డట్టయింది. భార్యని సమాధానపర్చడం కోసం తన చర్యని సమర్థించుకోడానికి పాయింట్లు వెతుక్కున్నాడు.

"అలా యిదైపోతావెందుకే... దీని వల్ల మనకి చెడిపోయేదేమీ లేదు... పైపెచ్చు– అమ్మ టీవీలో ఫలానా కార్యక్రమంలో కనిపించే ఏర్పాట్లు చేశామని, చూడవలసిందనీ బంధువులందరికీ ఉత్తరాలు రాద్దాం. దీంతో అమ్మని మనం ఎంత అపురూపంగా చూసుకుంటున్నామో అందరికీ తెలుస్తుంది. బంధువుల్లోను, ఆఫీసులో స్నేహితుల్లోనూ మనకి కొద్దో గొప్పో మంచి పేరే వస్తుంది..." అని తన ఆలోచన బయటపెట్టాడు భీమశంకరం. తల్లి పట్ల బాధ్యత వహించాల్సిన కొడుకుగా– తన ఆలోచనలోని వికృతత్వం, అసహజత్వం అతనికా సమయంలో



## నా గురించి నేను

1952లో భీమునిపట్నంలో పుట్టాను. తెలుగులో బి.ఎ.చేశాను. శ్రీవారు శ్రీ జోగారావు కథారచయిత. వారి కథలన్నీ ముందుగా చదివేది నేనే. ఆ సరదాతోనే కలంపట్టి, వారి సూచనలతో ఒకటో అరో కథలు రాసేను. ఆంధ్రజ్యోతి, ప్రభ, భూమి, కలువబాలల్లో నా రచనలు వచ్చేయి.

ఆర్థిక కారణాల వల్ల విచ్ఛిన్నమవుతున్న మానవ సంబంధాలను గురించి కథలు రాయడం నాకిష్టం. 'నేటి కథలో' నా రచనలు వేస్తూ శ్రీకా.రా. మాస్టారు వ్యక్తిగతంగా ఉత్తరాలలో సూచనలిస్తూ ఆలోచింపచేశారు. విజయనగరం జిల్లా రచయితల సంఘంలో సాధారణ సభ్యురాలిని. నా కథకు బహుమతినిచ్చి ప్రోత్సహించిన ఆంధ్రజ్యోతి సంపాదకులకు, న్యాయనిర్ణేతలకు ధన్యవాదాలు.

స్ఫురించనే లేదు.

జగదాంబ అయిష్టంగానే తలూపింది. తన ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేని అన్నపూర్ణమ్మగారు ఆ టీవీ కార్యక్రమంలో పాల్గొనడం ఖరారైపోయింది. ఎపిసోడ్ షూటింగ్‌నాడు సునందవల్లి నాయనమ్మని స్టూడియోకి తీసుకెళ్లడానికి నిశ్చయమైపోయింది.

తల్లినీ కూతుర్నీ టీవీ స్టూడియోకి ఆటోలో పంపించి, తల్లి పాల్గొనే కార్యక్రమం టీవీలో త్వరలో రాబోతోందని, వివరాలు తర్వాత తెలియజేస్తానని బంధువర్గానికి సగర్వంగా ఉత్తరాలు రాసి పడేశాడు భీమశంకరం.

* * *

మరో నాలుగునెలల తర్వాత టీవీలో 'మీతో మేము' కార్యక్రమం ప్రసారమవుతూ వుంటే, టీవీ ముందు కూర్చున్నారు జగదాంబ, భీమశంకరం. ఆ కార్యక్రమం అంతా వృద్ధులతోనే వుంటుందని అప్పటికే టీవీ ప్రకటనల ద్వారా ప్రచారం విస్తృతంగా జరిగింది. బంధువులనుంచి, స్నేహితుల నుంచి తనకందబోయే అభినందనలని తలచుకుంటూ టీవీ చూస్తున్నాడు భీమశంకరం. జగదాంబ నోటికి జడిసి తల్లికి పాతకాలపు పౌరాణిక సినిమా కూడా చూపించి ఎరగడు తను. తనూ, భార్యా తల్లిని సరిగా చూసుకోవడం లేదని బంధువుల్లో కొందరికి అప్పటే అనుమానం పొడుకుని వుంది. ఒకరిద్దరు వర్మగర్భంగా మాటలు దొర్లించేరు కూడా. 'ఈ టీవీ కార్యక్రమంతో వాళ్ల నోళ్ళు దెబ్బకు మూసుకునిపోతాయి' అనుకుంటూ కార్యక్రమం చూడసాగేడు.

దాదాపు పాతికమంది మహిళలూ, పురుషులూ కనిపిస్తున్నారు తెరమీద. అంతా వయసు మళ్ళినవాళ్లే. ప్రశ్నలూ, సమాధానాలు– రసవత్తరంగా సాగుతోంది కార్యక్రమం. ఎక్కడా తన తల్లి కనిపించలేదు. బహుశా రెండో ఎపిసోడ్‌లో కనిపిస్తుందేమో... మళ్లీ వారం వరకు ఆగాలి...

ఇరవై నిమిషాల కార్యక్రమం మధ్యలో ప్రకటనల కోసం కొద్దిపాటి విరామంతో కొనసాగింది. అందులో పాల్గొన్న వృద్ధులంతా ఎంతో ఉల్లాసంగా మాట్లాడుతున్నారు. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న వ్యక్తి ఓ సుప్రసిద్ధ సినిమా కారెక్టర్ యాక్టర్. ప్రశ్నలు వేసి, జవాబులు రాబడుతున్నాడు. వృద్ధులంతా తమ బాల్యం గురించి, పిల్లల చదువులూ, ఉద్యోగాల గురించి సరదాగా మాట్లాడుతున్నారు.



## సంజయ్‌దత్ పెళ్ళి

టాడా కేసులో ఇరుక్కున్న సంజయ్‌దత్‌కు మాధురీ ఎందుకొచ్చిన గొడవలే అనుకుని హాండిచ్చేసింది. ఆ తర్వాత అతని జీవితంలోకి ప్రవేశించిన రియా పిళ్ళై అతని కష్టసుఖాల్లో అంటిపెట్టుకుని వుంది. ఇంతవరకు ఆమెతో పెళ్ళిమాటే ఎత్తని సంజయ్‌దత్ త్వరలోనే ఆమెను పెళ్ళి చేసుకోనున్నానని ప్రకటించాడు.

అప్పుడు జరిగిందది! భీమశంకరం అప్పటివరకు కలలోనైనా ఊహించని విషయం...

ఓ వృద్ధురాలు, తన వంతు వచ్చినపుడు– ఏడుస్తూ మాట్లాడడం ప్రారంభించింది. తనకి ముగ్గురు కొడుకులనీ, ఎవరూ తనని సరిగా చూసుకోవడం లేదని... తన ప్రస్తుత పరిస్థితి చెప్పకోలేనంత దుర్భరంగా వుందని... కనీసం వృద్ధుల ఆశ్రమంలో దేనిలోనయినా చేర్పించమని ప్రాధేయపడినా కొడుకులూ, కోడళ్ళూ వినిపించుకోవడం లేదనీ– కన్నీరు మున్నీరుగా విలపిస్తూ మాట్లాడింది ఆమె.

చిన్నతెర మీద ఆమె మాటలు వింటూ భీమశంకరం, జగదాంబ నీరు కారిపోయేరు. తల్లి టీవీలో కనిపిస్తే అందరిలో తనకి గొప్పగా వుంటుందని ఊహించాడే తప్ప– ఇలా కూడా జరిగే అవకాశం వుందని భీమశంకరానికింతవరకు తట్టనే లేదు! పై వారం ప్రసారమయే ఎపిసోడ్‌లో తల్లి కూడా ఇలాగే మాట్లాడితే తమ పరువేం కావాలి! అందరిలో తలెత్తుకుని తిరగ్గలడా! ఈ ఆలోచన వచ్చేక సిగ్గుతో భయంతో కంపించిపోయేడతను.

ఆ రోజునుంచి ఆ దంపతులకు సరైన నిద్రాహారాలు లేవు. 'మీ నాన్నమ్మ టీవీ షూటింగ్‌లో ఏం మాట్లాడిందే' అని ఎంతగా గుచ్చి గుచ్చి అడిగినా సునందవల్లి పెంకిగా సమాధానం చెప్పకపోవడంతో వాళ్ళ ఆందోళన రెట్టింపయింది.

తల్లినే నేరుగా అడిగేద్దామా అనిపించింది భీమశంకరానికి. కాని ఆవిడ రెండు నెలల క్రితమే తమ్ముడి దగ్గరకు వెళ్ళిపోయింది. ఓ ఆర్నెల్లు అక్కడా, ఆర్నెల్లు తనదగ్గరా అని అమ్మని వాటాలు వేసుకున్నారాయె!

తన బంధువులూ, స్నేహితులూ అందరూ రాబోయే వారం కూడా టీవీలో తప్పనిసరిగా ఆ కార్యక్రమం చూస్తారు... ఆవిడ ఏం మాట్లాడిందో! తలచుకుంటేనే వెన్ను జలదరిస్తోంది భీమశంకరానికి. జగదాంబ ఓవైపు తిట్టిపోస్తోందతన్ని.

విపరీతమైన టెన్షన్‌తో ఎలాగో ఆ వారం గడిచింది వారికి. తర్వాత వారం ఆ కార్యక్రమం ప్రసారమయే వేళకి చెప్పలేనంత భయాందోళనలతో టీవీముందు చేరారు దంపతులిద్దరూ. టీవీలో కార్యక్రమం మొదలయిందో లేదో– కరెంటు పోయింది. మళ్ళీ ఎప్పటికో కాని కరెంటు రాలేదు. ఈలోగా ఆ కార్యక్రమం పూర్తయింది. భీమశంకరానికి, జగదాంబకి ఊపిరి స్తంభించి పోయినట్టయింది. వాళ్ళ ఆందోళనకీ, వ్యధకీ అంతులేదు. సర్వశక్తులూ ఉడిగిపోయినట్టు వుండిపోయేరు. చాలా సేపటికి కానీ తేరుకోలేదు.

ఆ తర్వాత మళ్ళీ ఇంట్లో ఘర్షణ మొదలయింది. కేకలు, పరస్పర నిందారోపణలు, అరచుకోవడాలతో ఇల్లు దద్దరిల్లిపోయింది..

ఎంత బతిమాలినా, ఎన్ని విధాల అడిగినా సునందవల్లి నోరు విప్పలేదు. ఏమీ చెప్పకుండానే తన గదిలోకి వెళ్ళిపోయింది. ఆ దంపతుల ముఖాల్లో కత్తివేటుకి నెత్తురు చుక్క లేదు.

గదిలో కూర్చున్న సునందవల్లికి– తల్లిదండ్రుల ఘర్షణ చెవిన పడుతూనే వుంది. తనలో తను నవ్వుకుంది–

'ఇవాళో రేపో– ఏం జరిగిందో అమ్మకీ నాన్నకీ తెలీకుండా పోదు.. కనీసం అంతవరకయినా వాళ్ళనా మనోవ్యథ అనుభవించనీ– నాయనమ్మ పట్ల రోజూ వాళ్ళు చూపే అనాదరణకి వాళ్ళకీపాటి శిక్ష సమంజసమే!' కసిగా అనుకుంది.

ఆరోజు నాయనమ్మ తనతో అన్న మాటలు గుర్తొచ్చేసి సునందవల్లికి. "ఆ టీవీ వాళ్ళ దగ్గరికి వెళ్ళొద్దే సునందా.. వాళ్ళేవేవో అడుగుతారు... నిజం చెప్పడానికి ధైర్యం చాలదు. అబద్ధమాడాలంటే నోరు రాదు.. మనం అక్కడికి వెళ్ళలేదన్న సంగతి మీ అమ్మా నాన్నలకు చెప్పొద్దు.. తర్వాత ఎలగో తెలిస్తే తెలుస్తుంది.. మీ నాన్న ఫ్రెండు రామ్మూర్తి లేడూ– అతన్ని కూడా ఈ విషయం దాచిపెట్టమని నువ్వే అడుగు– ఏం" అంది నాయనమ్మ.

ఆరోజు ఆ మనవరాలూ, నాయనమ్మా అసలు టీవీ స్టూడియోకే వెళ్ళలేదని– చాలా సేపటివరకు బిర్లామందిర్‌లోనే గడిపి వచ్చేరని– జగదాంబకీ, భీమశంకరానికీ ఇప్పట్లో తెలిసే అవకాశం లేదు!

*




పూర్వ జన్మ జ్ఞాపకాలతో పుట్టిన
ఆ బ్యూటీక్వీన్‌ను
స్వంతంచేసుకోవడానికి ఆకోటీశ్వరులిద్దరూ
పోటీపడ్డారు. గెలుపు ఎవరిది?
టీనేజ్ యూత్ లోని
లవ్లీ, రొమాంటిక్ ఊహలకు రూపకల్పన
ఆద్యంతం సస్పెన్స్, రొమాన్స్ సీరియల్
సరికొత్త రచయిత

**మైథిలీ వెంకటేశ్వరరావు**

## అంతఃపుర కన్య

వచ్చే సంచిక నుంచి ప్రారంభం